# ఉత్తమ నగర పాలక సంస్థగా ఖమ్మం

## బెస్ట్ జీపీగా 'పాలెం'.. అవార్డులు అందుకున్న మేయర్, సర్పంచ్


అవార్డు అందుకుంటున్న మేయర్, డిప్యూటీ మేయర్


అవార్డు అందుకుంటున్న సర్పంచ్, కార్యదర్శి

ఖమ్మం/ రఘునాథపాలెం, జూన్ 19: హరితహారంలో సాధించిన అత్యుత్తమ ఫలితాలకుగాను ఉత్తమ నగర పాలక సంస్థగా ఖమ్మం ఎంపికైంది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో జరిగిన హరితోత్సవంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నుంచి మేయర్ పునకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా, అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరిలు ఈ అవార్డులను అందుకున్నారు.

**రఘునాథపాలేనికి బెస్ట్ అవార్డు**

రఘునాథపాలేనికి కూడా ఉత్తమ గ్రామ పంచాయితీ అవార్డు దక్కింది. హరితోత్సవంలో భాగంగా ఎంపిక కావడంతో గ్రామ సర్పంచ్ గుడిపూడి శారద, గ్రామ కార్యదర్శి శ్రీనివాసకుమార్ కూడా హైదరాబాద్‌లో ఇదే వేదికపై రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి నుంచి అవార్డులను అందుకున్నారు.

## ఎంపీ నామాకు ప్రముఖుల శుభాకాంక్షలు

ఖమ్మం, జూన్ 19: ఎంపీగా నాలుగేళ్లు పూర్తిచేసుకున్న బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావుకు సోమవారం పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నాలుగేళ్లలో నియోజకవర్గానికి తాను చేసిన అభివృద్ధిని, చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలను నామా వివరించారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 19: నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు ఐదుగురు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ చాటారు. వీరిలో కీర్తిప్రియ-2115, యశస్విని-2560, మానస-3175, రవళి-3985, హేమరూపిని-4638 ర్యాంక్ సాధించారు. వీరిని ఆర్‌సీఓ ప్రత్యూష, ప్రిన్సిపాల్ చావా జ్యోతి, అధ్యాపకులు అభినందించారు.

## ఆరు నెలల పిండం లభ్యం

మామిళ్లగూడెం, జూన్ 19: నగరంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వెనుక గుర్తు తెలియని ఆరు నెలల పిండం సోమవారం లభ్యం అయింది. కార్యాలయంలో పని చేసే ఓ మహిళ ఆఫీసు వెనుక వైపునకు వెళ్లగా మృత పిండం కన్పించింది. ఆమె సమాచారం మేరకు ఖమ్మం త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకొని మృత పిండాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు ఎంపికలు

మామిళ్లగూడెం, జూన్ 19: ఈ విద్యాసంవత్సరానికి కార్పొరేట్ కళాశాలల్లో చేరేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు 94 మంది ఎంపికయ్యారు. మొదటి దశలో 72 మందికి సీట్లు కేటాయించారు. టేకులపల్లి ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలలో పదోతరగతి చదివిన పి.నాగఅఖిల, వేంసూరు ఎస్సీ బాలుర హాస్టల్‌లో పదోతరగతి చదివిన ఎన్.జస్వంత్‌కు కళాశాల కేటాయింపు పత్రాలను కలెక్టర్ వీపీ గౌతమ్ సోమవారం ఐడీవోసీలోని తన చాంబర్‌లో అందించారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు బాస్కెట్‌బాల్ క్రీడాకారులు..

రఘునాథపాలెం, జూన్ 19: హైదరాబాద్ కేవీబీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగే జూనియర్ స్టేట్‌మీట్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు ఖమ్మంలో క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లోని ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన ఎంపికలకు 150 మంది బాలబాలికలు హాజరయ్యారు. అండర్-18 విభాగంలో క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఖమ్మం డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు శ్రీనివాసులు, వీపీ రమణ, ఎం.చంద్రకాంత్, తోడేటి లింగరాజు తెలిపారు.

## సీఐ అంజలికి బాలల హక్కుల వేదిక సన్మానం

మామిళ్లగూడెం, జూన్ 19: ఖమ్మం ట్రాఫిక్ సీఐగా, చైల్డ్ వెల్ఫేర్ పోలీస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న నెదునూరి అంజలిని రాష్ట్ర బాలల హక్కుల ప్రజా వేదిక అధ్యక్షుడు వలస సుభాశ్ చంద్రబోస్ సోమవారం ఖమ్మంలో సన్మానించారు. ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన.. పోలీస్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో సీఐ చేస్తున్న సేవలను గుర్తించి అభినందించారు. వేదిక బాధ్యులు మంగళపల్లి శారదాదేవి, కందాళ రాజమౌళి, సకినాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

రఘునాథపాలెం/ మామిళ్లగూడెం, జూన్ 19: మున్నూరుకాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మున్నూరుకాపు సంఘం బాధ్యులు ఆకుల గాంధీ, ఆర్జేసీ కృష్ణ, శెట్టి రంగారావు, పారా నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు కలెక్టర్ వీపీ గౌతమ్‌కు, అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు సోమవారం ఐడీవోసీలో వినతిపత్రాలు అందజేశారు. సంఘం బాధ్యులు కొత్తా సీతారాములు, మెంతుల శ్రీశైలం, కేదాసు నర్సయ్య, జాబిశెట్టి శ్రీనివాస్, మాదంశెట్టి హరిప్రసాద్, యాసా రామారావు, గుందేపిన్ని నర్సింహారావు, చెరుకూరి భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాల్లో మొక్కలు నాటుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు వారియర్, చిత్రంలో అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ రాధిక

# చెట్లతోనే మనిషి మనుగడ

- హరితోత్సవంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- నియోజకవర్గంలో ఊరూరా మొక్కల సందడి

రఘునాథపాలెం/ మామిళ్లగూడెం, జూన్ 19: మనిషి మనుగడ చెట్లతోనే ఆధారపడి ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. హరితోత్సవంలో భాగంగా ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గోపాలపురం ఎన్నెస్పీ కాలువ కట్టపై పెద్ద ఎత్తున మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి మంత్రి పువ్వాడ ముఖ్య అతిథిగా హాజరై మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. మేయర్ పునకొల్లు నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభి, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు వాంకుడోతు సురేశ్, కార్పొరేటర్ సైదులు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**ఊరూరా సందడిగా 'హరితోత్సవం'**

దశాబ్ది వేడుకల్లో భాగంగా హరితోత్సవం కార్యక్రమం సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో సందడిగా కొనసాగింది. ఊరూరా వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాలు, ప్రభుత్వ పాఠశాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యలయాల నుంచి నర్సరీల వరకు హరితోత్సవ ర్యాలీలు నిర్వహించారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో..**

నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ ప్రాంతాల్లో సోమవారం హరితోత్సవం జరిగింది. ఐడీవోసీలో కలెక్టర్ వీపీ గౌతమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా మొక్కలు నాటారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పరందామరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, మేయర్ నీరజ, కార్పొరేటర్ లక్ష్మి కలిసి మొక్కలు నాటారు. ఖమ్మం టౌన్ ఏసీపీ కార్యాలయంలో కమిషనర్ మొక్క నాటారు.


ఎన్నెస్పీ కాలువ కట్టపై మొక్క నాటుతున్న మంత్రి


కోయచలక వైకుంఠధామంలో..


చింతగుర్తిలో..


వేపకుంట్లలో..


పువ్వాడ ఉదయ్ నగర్‌లో..


రఘునాథపాలెంలో..

# పాఠశాలల్లో నేడు 'చదువుల పండుగ'

**అధికారుల వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్ వీపీ గౌతమ్**


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, జూన్ 19: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్ని పాఠశాలల్లో విద్యాదినోత్సవాన్ని (చదువుల పండుగ) ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ కోరారు. విద్యాదినోత్సవ ఏర్పాట్లపై ఆయన సోమవారం ఐడీవోసీ నుంచి విద్యాశాఖ, ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలను మామిడి తోరణాలు, బెనూన్లతో అలంకరించాలన్నారు. 'మన బడి' పనులు పూర్తయిన పాఠశాలల పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డిజిటల్ తరగతులు, ఇంటరాక్ట్ బ్లాక్ ప్యానెళ్లను ప్రారంభించాలని, పాఠ్య-నోట్ పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేయాలని ఆదేశించారు. గుర్తించిన పాఠశాలల్లో రాగి జావ పంపిణీ ప్రారంభించాలన్నారు. అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, శిక్షణ సహాయ కలెక్టర్ రాధికాగుప్తా, అధికారులు సోమశేఖర శర్మ, కృష్ణలాల్, శ్యామ్‌ప్రసాద్, నాగశేషు, కేవీకే శ్రీనివాస్ పాల్గొన్నారు.

**విద్యాదినోత్సవాన్ని నిర్వహించాలి**

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 19: విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని డీఈవో సోమశేఖర శర్మ కోరారు. ఆయన సోమవారం రోటరీనగర్ ఉన్నత పాఠశాలలో విద్యాదినోత్సవ కమిటీతో సమావేశమయ్యారు. ఏర్పాట్లను సమీక్షించారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. రోటరీనగర్ పాఠశాలలో 'మన బస్తీ-మన బడి'ని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభిస్తారని చెప్పారు.

**ఓటరు దరఖాస్తులను పరిష్కరించాలి**

మామిళ్లగూడెం, జూన్ 19: జిల్లాలో ఓటరు జాబితాకు సంబంధించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. ఆయన సోమవారం ఐడీవోసీ నుంచి ఆర్వోలు, తహసీల్దార్లు, బూత్ స్థాయి సూపర్‌వైజర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో ఫారం-6కు సంబంధించి ఇప్పటి వరకు 14,586 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 10,990 దరఖాస్తులు పరిష్కారమైనట్లు చెప్పారు. మిగతా వాటిని మంగళవారం పరిష్కరించాలని ఆదేశించారు.